సాగు పనులకు కూలీల కొరత

- పత్తి విత్తనాలు విత్తడానికి ఇబ్బందులు పడుతున్న రైతన్నలు
- అదును పోతుందేమోనని ఆందోళన
- పెరిగిన కూలీల ధరలు

సంస్థాన్ నారాయణపురం : వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా మనుగడసాగిస్తున్న అన్నదాతలకు వానాకాల పంటల సాగు కష్టంగా మారుతోంది. ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో అందుకు తగ్గట్టుగా గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు సాగుకు భూములను సిద్ధం చేస్తున్నారు రైతన్నలు. ప్రస్తుతం వర్షాలతో మండలంలో పత్తి విత్తనాలు విత్తడానికి రైతులు సిద్ధమవుతున్నారు. కానీ కూలీలు దొరక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూలీల కొరత వేధిస్తుంటే కూలీలు ధరలు పెంచడంతో రైతులుకు భారంగా మారింది. మండలంలో 30వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తున్నారు. మొన్నటి వరకు పత్తి విత్తనాల కోసం ఇబ్బందులు పడిన రైతులు, ఇప్పుడు పత్తి విత్తనాలు విత్తడానికి కూలీలు దొరక్క ఇబ్బందులు పడాల్సివస్తుంది.


జనగాం పరిధిలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

ముమ్మరంగా సాగుపనులు..

వేసవిలోనే వర్షాలు కురవడంతో రైతులు ముందస్తుగానే భూములను చదునుచేసి ఉంచారు. అదే విధంగా విత్తనాలను సైతం కొనుగోలు చేశారు. గత వారం రోజుల నుంచి వర్షాలు పడుతుండడంతో రైతులు పత్తి విత్తనాలు విత్తడానికి సిద్ధం కాగా, కూలీల కోసం ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. వర్షం కురవడంతో తేమ అదను పోతుందని అందరూ విత్తనాలు ఒకే సారి విత్తుతుండడంతో కూలీల కొరత ఏర్పడింది. కూలీలు 10నుంచి 20వరకు మంది కలిసి గ్రూపులుగా ఏర్పడి విత్తనాలు విత్తుతున్నారు. కొంత మంది రైతుల కుటుంబ సభ్యులు కలిసి వారి భూముల్లో విత్తుకుంటున్నారు. కొంత మంది రైతులు ఇతర గ్రామాల నుంచి అధిక కూలి ఇచ్చి మరీ కూలీలను తీసుకొచ్చి విత్తనాలు విత్తుకుంటున్నారు.

పెరిగిన కూలి ధరలు..

గత సంవత్సరం పత్తి విత్తనాలు విత్తడానికి ఎకరాకు రూ.5వందల నుంచి 6వందల తీసుకున్నారు. ఈ సంవత్సరం ఎకరాకు మరో వంద అదనంగా పెంచారు. కూలీల చొప్పున విత్తడానికి వస్తే రోజుకు గతంలో రూ.500 తీసుకొనే వారు. ప్రస్తుతం రూ.600 నుంచి రూ.700 వరకు తీసుకుంటున్నారు. ఒక కూలీ రోజుకు ఒక ఎకరం వరకు విత్తనాలు విత్తతుంది. ఇప్పటికే పత్తి విత్తనాల ధరలు పెరగడంతో రైతులుకు భారం కాగా, కూలి ధరల పెరగడంతో రైతులకు మరింత భారంగా మారనుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయానికి ఉపాధిహామీ పథకాన్ని అనుసందానిస్తే ఆర్థికంగా భారం తగ్గి, మేలు జరిగే అవకాశం ఉంటుందని ఆయా గ్రామాల అన్నదాతలు కోరుతున్నారు.

కూలి రూ.700 అడుగుతున్నారు



పత్తి విత్తనాలు విత్తడానికి కూలీకి వస్తే రోజుకు రూ.700 కూలి అడుగుతున్నారు. గత సంవత్సరం రోజు కూలి కాకుండా ఎకరాకు రూ.600 తీసుకున్నారు. కూలి ధరలు పెరగడం రైతులకు భారంగా మారనుంది.

– వీరమళ్ల కిరణ్, యువ రైతు, వావిళ్లపల్లి

ఉపాధిహామీకి అనుసంధానం చేయాలి



వర్షం పడటంతో అందరు ఒకే సారి విత్తనాలు విత్తుతుండడంతో కూలీలు ధరలు పెంచారు. ఎకరాకు పత్తి విత్తనాలు విత్తడానికి రూ.700 తీసుకుంటున్నారు. ఇతర ఖర్చులు కూడా పెరగడం, కూలీల ఖర్చులు పెరగడం కొంత మెర భారం కానుంది. ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలి.

– వాంకుదోతు రాజు, రైతు, వాచ్యాతండా

ఎయిమ్స్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ


యోగాపై శిక్షణ ఇస్తున్న డాక్టర్ నీరజ

బొమ్మలరామారం : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ముందస్తుగా బీబీనగర్ ఎయిమ్స్ రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం యోగాపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణుల సుఖప్రసవం కోసం యోగా ప్రాముఖ్యతతో పాటు కొన్ని ముఖ్యమైన యోగాసనాలను ఎయిమ్స్ యోగా టీచర్ నీరజ నేర్పించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆయుష్ ఆరోగ్య కరదీపికను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, ఆయుష్ డాక్టర్ క్రాంతికుమార్, ఎయిమ్స్ వైద్యులు అఖిల్, ఫార్మసిస్ట్ శంకర్, హెల్త్ సూపర్‌వైజర్ జనార్దన్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవకతవకలపై అధికారులకు ఫిర్యాదు


చేనేత జిల్లా ఏడీ విద్యాసాగర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

చౌటుప్పల్ : చౌటుప్పల్‌లోని చేనేత సహకార సంఘంలో చోటుచేసుకున్న అవకతవకలపై సంఘం సభ్యులు, పలువురు నాయకులు శనివారం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని చేనేత, జౌళి శాఖ ప్రధాన కార్యాలయంతో పాటు జిల్లా ఏడీ విద్యాసాగర్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఈనెల 3న చివరి సమావేశం అని చెప్పి కార్యవర్గ సభ్యులు ఆర్డర్ ఫారాలను రాసుకొని తీర్మాణం చేసుకుని అనుకూలమైన పదిమందికి ఇచ్చారని అన్నారు. ఎలాంటి అనుమతి లేకుండానే వర్క్‌షెడ్ వద్ద ఉన్న భవనాన్ని విక్రయించేందుకు తీర్మాణం చేశారని, సంఘం సొమ్మును వ్యక్తిగతానికి వాడుకున్నారని, తాము ఫిర్యాదు చేస్తున్నామని తెలియడంతో తిరిగి అకౌంట్‌లో జమ చేశారన్నారు. విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో గోశిక పురుషోత్తం, వనం ధనుంజయ్య, గుర్రం నర్సింహ, రవీందర్, భిక్షపతి ఉన్నారు.

క్లుప్తంగా

సీపీఐలో పలువురి చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట రూరల్ (ఆలేరురూరల్) : ఆలేరు మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు శనివారం ఆలేరు పట్టణంలో సీపీఐ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా వారికి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోద శ్రీరాములు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్, సత్తయ్య, నమిలె స్వామి, పరశురాములు, కృష్ణయ్య, ఆంజనేయులు తదితరులున్నారు.

మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సబిత

బొమ్మలరామారం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా రిజర్వేషన్‌లు అమలు చేయాలని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు, నివాస స్థలాల్లో ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలన్నారు. సమావేశంలో వడ్లకొండ భారతమ్మ, జ్యోతి, అరుణ, మౌనిక, నాగమణి, లావణ్య, సంధ్యారాణి, జయమ్మ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

మోత్కూరు : మండలంలోని ముశిపట్ల గ్రామంలో బుగ్గరామలింగేశ్వర స్వామి గుట్టపైన నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం పైళ్ల సోమిరెడ్డి, పైళ్ల నర్సిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప స్వాములకు పంచామృతాలతో అభిషేకం చేసి హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పైళ్ల విజయ, తండ సత్తయ్య, గ్రామ పెద్దలు ఆనందం, సుదర్శన్, చెన్నారెడ్డి, దశరథ, మడిగె శేఖర్, నర్సింహ పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ పండుగ



పూజల్లో పాల్గొన్న మాజీ జెడ్పీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి

బీబీనగర్ : మండలంలోని వెంకిర్యాల గ్రామంలో శనివారం దుర్గమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ వేడుకల్లో మాజీ జెడ్పీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెరువు అచ్చయ్యగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ చింతల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు, వెంకిర్యాల గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'అనుమతులు లేని పాఠశాలలను మూసివేస్తాం'

చౌటుప్పల్ : పట్టణంలో అనుమతి లేకుండానే నెలకొల్పుతున్న ప్రైవేట్ పాఠశాలలను మూసివేస్తామని ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న చైతన్య స్కూల్, అంబిటస్ పాఠశాలలను ఆయన శనివారం సందర్శించారు. అనుమతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అంబిటస్ పాఠశాలకు ఓపెనింగ్ అనుమతి ఉండగా, చైతన్య స్కూల్‌కు ఎలాంటి అనుమతి లేనట్లుగా గుర్తించారు. పాఠశాల గుర్తింపు కోసం ఓపెనింగ్ ఫైల్ తక్షణమే వేయాలని చైతన్య స్కూల్ నిర్వాహకులకు సూచించారు.

భువనగిరిలో మోస్తరు వర్షం


భువనగిరిలో రాంనగర్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

భువనగిరి: భువనగిరి పట్టణంలో శనివారం మధ్యాహ్నం తర్వాత మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. నల్లగొండ రోడ్డులోని జంఖానగూడెం వద్ద, రాంనగర్ చౌరస్తా సమీపంలో రోడ్ల మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. భువనగిరి కోర్టు ఆవరణతోపాటు ఆర్టీసీ బస్టాండ్ వరద వరదనీటితో నిండిపోయింది. రోడ్లపై వరద పారడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి


బొమ్మలరామారం : బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


ఆత్మకూరు(ఎం) : టి.రేపాకలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బొమ్మలరామారం : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని జిల్లా సీఎంఓ పెసరు లింగారెడ్డి అన్నారు. మండలంలోని చీకటిమామిడి గ్రామంలో శనివారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ఉపాధ్యాయులతో కలసి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులు, విద్యార్థులకు అందుతున్న నాణ్యమైన విద్యాబోధనలపై తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, ఇటికాల మల్లేష్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో వసతులపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

చిన్నకందుకూరులో బడిబాట

యాదగిరిగుట్టరూరల్ : మండలంలోని చిన్నకందుకూరు గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధ్యాయులు ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అందించే పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, నాణ్యమైన బోధన పద్ధతులపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాల్లోనే విద్యార్థులను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లిక్కి జానకి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న గెలుపొందడం హర్షణీయం


భూదాన్‌పోచంపల్లి : సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

భువనగిరిటౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతు తీన్మార్ మల్లన్న గెలుపొందడం హర్షణీయమని రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి పిట్టల బాలరాజ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలో బాలరాజ్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎండీ రఫియోద్దీన్ ఘూరి, జిల్లా అధ్యక్షుడు సామల రవీందర్, గుమ్మడిల రమేష్, సిరికొండ శివకుమార్, సేవాదళ్ జిల్లా కార్యదర్శి శివుడు, టౌన్ ప్రెసిడెంట్ ఠాకూర్‌ప్రకాష్, వి.నరసింహ, ఏశాల రాజు, సుబ్బూర్ శ్రీనివాస్, సోమ రవీందర్‌రెడ్డి, ఉపేందర్ ఉన్నారు.

పేటలో కాంగ్రెస్ విజయోత్సవ వేడుకలు

రామన్నపేట : పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆ పార్టీ నాయకులు శుక్రవారం రాత్రి విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ జహంగీర్, వనం చంద్రశేఖర్, ఎండీ నాజర్, కేశవదాసు వెంకటేశం, ఎండీ మహబూబ్, ఎ.లక్ష్మన్, అనంతకుమార్, మన్సూర్‌అలీ, సాల్వేరు ప్రవీన్, బషీరుద్దౌలా, ఎండీ ఖరీం, బొడ్డు శంకరయ్య, శంకర్, తాహెర్, రిజ్వాన్, గొలుసుల ప్రసాద్, కొమ్ము శేఖర్, పల్లపు రవి, ప్రవీన్, అజార్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలుపొందడం హర్షనీయమని కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు అన్నారు. అయన గెలుపు పట్ల మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి భారీ ర్యాలీ నిర్వహించి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశంగౌడ్, నాయకులు ఎడ్డు వెంకటేశ్వర్లు, అనిల్‌కుమార్, రంగ స్వామి పాల్గొన్నారు.

గుండాల : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో విజయం సాధించిన తీన్మార్ మల్లన్న ను మండలానికి చెందిన యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రసాద్ శనివారం కలిసి సన్మానించారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న విజయం సాధించడం పట్ల శనివారం పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చౌరస్తా వద్ద బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, యువజన అధ్యక్షుడు సీత సుధాకర్, నాయకులు మెరుగు శశికళ, కుక్క స్వామి, గునిగంటి వెంకటేశ్, కుక్క కుమార్, కీర్తి సంజీవ, రుద్ర చందు, బిట్ల గణేశ్, వంగూరి పాండు, శ్రీను, నీలమ్మ, వేముల ఆనంద్, గుండు నవీన్, యాదగిరి పాల్గొన్నారు.

మోత్కూరు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపొందడం పట్ల శనివారం మున్సిపల్ కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు అవిశెట్టి అవిలుమల్లు, మండల ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజుగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మలిపెద్ది మల్లారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు మందుల సురేష్, వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు సన్మానం

బీబీనగర్ : పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన తీన్మార్ మల్లన్నను హైదరాబాద్‌లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గోలి పింగల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ మండల నాయకులు శాలువాలతో సన్మానించారు. ఆయన వెంట పార్టీ జిల్లా నాయకులు కాసుల ఆంజనేయులు గౌడ్, పింగలన్న సేవా దళ్ గౌరవ అధ్యక్షుడు కాసుల రఘునందన్‌గౌడ్, అధ్యక్షుడు ఎండీ.మోయిన్, ప్రధాన కార్యదర్శి ఎలుగల నరేందర్, ఉపాధ్యక్షులు తుమ్మల నర్సింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కాసుల అజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

జోరుగా చేపల విక్రయాలు


భువనగిరి : చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

భువనగిరి/భూదాన్‌పోచంపల్లి : జిల్లా వ్యాప్తంగా శనివారం మృగశిర కార్తె సందడి నెలకొంది. పలు పట్టణాల్లో చేపల మార్కెట్ల వద్ద భారీ జనసందోహం కనిపించింది. మృగశిర కార్తె రోజున తప్పనిసరిగా చేపలను తినాలనేది ప్రజల నమ్మకం. దీంతో చేపల కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా మారాయి. పలు ప్రాంతాలలో ఉదయం నుంచే చేపల విక్రయాలు జరిగాయి. మార్కెట్లలో రవ్వ, బొచ్చె చేపలను కిలో రూ.200లు, పాంప్లెట్ రూ.150లు, కొర్రమట్ట రూ.600లకు విక్రయించారు.

లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం

- చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహతీవైష్ణవి


చౌటుప్పల్ : లోక్‌అదాలత్‌లో పాల్గొన్న జడ్జి మహతీవైష్ణవి


యాదగిరిగుట్టరూరల్ : ఆలేరు లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి సూర సుమలత

చౌటుప్పల్ : లోక్ అదాలత్‌తోనే కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహతీవైష్ణవి అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్, నారాయణపురం, పోచంపల్లి మండలాలలోని 3034 (సివిల్-02, క్రిమినల్-3023, పీఎల్‌సీ(చిన్నకేసులు)-09) కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సమయంతో పాటు డబ్బు ఎంతగానో ఆదా అవుతుందన్నారు. ఏడేళ్లలోపు శిక్ష విధించే కేసులన్నీ లోక్ అదాలత్‌లో పరిష్కారం అవుతాయన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నరేష్, పీపీ ఖాజా, న్యాయవాదులు ముత్యాల సత్తిరెడ్డి, బాల్యం వెంకటాచలపతి, పిట్టల భిక్షమయ్య, తాడూరి పరమేష్, జెల్ల రమేష్, బడుగు శ్రీకాంత్, మహిపాల్‌రెడ్డి, మక్తాల నర్సింహ, అల్లి స్వాతి, జక్కర్తి శేఖర్, కానుగుల వెంకటయ్య, సత్యనారాయణ, శ్రీశైలం, పాల్గొన్నారు.

యాదగిరిగుట్టరూరల్ (ఆలేరురూరల్) : లోక్‌అదాలత్‌తోనే సత్వర న్యాయం పొందవచ్చని ఆలేరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సూర సుమలత అన్నారు. శనివారం ఆలేరు పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించి మాట్లాడారు. క్షణికావేశంలో కోపం తెచ్చుకోవద్దని, సమస్యలు ఉంటే పెద్దల సమక్షంలో కూర్చొని పరిష్కారం చేసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పలు విభాగాల్లోని 1899 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఆయా విభాగాల్లోని నిందితుల వద్ద నుంచి జరిమానా రూపంలో రూ.5,49,580 వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ కొండల్‌రావు, ఆలేరు ఎస్ఐ శ్రీను, ఆత్మకూరు ఎస్ఐ నాగరాజు, పీపీ తదితరులున్నారు.

రాజీమార్గంతోనే కేసుల పరిష్కారం



రామన్నపేట : మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్

రామన్నపేట : పట్టింపులకు పోకుండా రాజీపడి కేసులను పరిష్కరించుకోవాలని రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎ.ప్రదీప్, అదనపు కోర్టు జడ్జి ఎస్.చందన అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. చట్టపరిధిలో రాజీపడదగిన కేసులను లోక్‌అదాలత్‌లతో పరిష్కరించుకోవడంతో ఇరుపక్షాలకు మేలు జరుగుతుందన్నారు. పేద నేరస్తులకు మండల లీగల్‌సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఉచితంగా న్యాయ సహాయం అందించనున్నట్లు తెలిపారు. కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీపీ ఉయ్యాల హన్మంత్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు మల్లయ్య, శ్రీకాంత్‌రెడ్డి, న్యాయవాదులు ఎం.ఎ.మజీద్, జినుకల ప్రభాకర్, పాల్వంచ జగతయ్య, మామిడి వెంకట్‌రెడ్డి, దినేష్, సుక్క శ్రవన్‌కుమార్, నోముల స్వామి, డి.సత్తయ్య, ఎస్.రమేష్, సూపరింటెండెంట్ గంగాభవానీ, శివరాజు, సాయి పాల్గొన్నారు.

రామోజీరావు మృతికి పలువురి సంతాపం


యాదగిరిగుట్టలో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట : రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు అకాల మరణంతో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి శనివారం వేర్వేరుగా సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రామోజీరావు చిత్రపటానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయతను, తెలుగు మీడియా రంగానికి కొత్త పంథాను నేర్పిన ఘనత రామోజీరావు దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక జర్నలిస్టులు, నాయకులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : రామోజీ గ్రూప్ అధినేత రామోజీరావు మృతి తీరనిలోటని టీడీపీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడుగు లక్ష్మయ్య అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వర్కాల వెంకటేశం, నల్ల పర్వతాలు, బొమ్మిరెడ్డి మల్లారెడ్డి, యాట వెంకటేశం, సుంకరి జంగయ్య, ముత్యాల పాపిరెడ్డి, పోలోజు గోవిందచారి, తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు : రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతి పట్ల శనివారం మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వివిధ వర్గాల విద్యావంతులు, అభిమానులు, జర్నలిస్టులు, రాజకీయ నాయకుల ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అదే విధంగా మోత్కూరు ప్రజాభారతి సాహితి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, పైళ్ల సోమిరెడ్డి, గౌరు శ్రీనివాస్, పోచం సోమయ్య, అన్నెపు వెంకట్, పొన్నబోయిన రమేష్, మెంట నగేష్, రాజు, సోంమల్లు, జర్నలిస్టులు, ప్రజాభారతి అధ్యక్షుడు డి.అరవిందరాయుడు, ప్రధాన కార్యదర్శి గుమ్మడెల్లి వెంకన్న, సలహాదారులు ఎస్ఎన్.చారి, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై జవాబు చెప్పాలి

మోత్కూరు : తుంగతుర్తి నియోజకవర్గంలోని మూసీ నది నుంచి జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై ఎమ్మెల్యే మందుల సామేల్ జవాబు చెప్పాలని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నబోయిన రమేష్, పట్టణ అధ్యక్షుడు జంగ శ్రీను డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలోని శాలిగౌరారం మండలం వంగమర్తి నుంచి జోరుగా ఇసుక లారీలు అక్రమంగా నడవడంపై ఎమ్మెల్యే సామేల్ స్పందించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఇసుక రవాణా చేసి కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారన్న సామేల్ ఇప్పుడు అతను ఎన్ని కోట్లు సంపాదిస్తున్నాడో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనుమతితో ఇసుక లారీలు నడిస్తే అక్రమం, ఇప్పుడు నడిస్తే ఎలా సక్రమం అయ్యాయో చెప్పాలన్నారు. ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళను చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కొండా సోంమల్లు, మల్లేషం, విష్ణుమూర్తి, అనిల్ ఉన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు

భువనగిరి : హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఈనెల 15న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన బీసీ కుల సంఘాల నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో సమగ్ర కుల గణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో 42శాతం పెంచకుండా ఎన్నికలకు వెళ్తే బీసీలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. అనంతరం మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేష్‌యాదవ్, అడ్వకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.గోవర్ధన్, నాయకులు మేకల కృష్ణ, రాసాల మల్లేష్, సురేష్, వెంకటేష్, రాజు, రమేష్, పాండు, బాలకృష్ణ, అశోక్, యాదగిరి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

గుండాల : మండలంలోని వెల్మజాల గ్రామంలో పునర్నిర్మాణం చేపట్టిన శివాలయానికి దాతలు శనివారం విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన కచ్చిగల్ల రామనర్సయ్య లక్ష్మి దంపతులు రూ.21వేలు, రంగు చంద్రమౌళి శోభ దంపతులు రూ.10వేల విరాళం అందజేశారు.

వైభవంగా బోనాల పండుగ


బోనాలతో వస్తున్న మహిళలు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురం గ్రామంలో శనివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ సురమాంబ కంఠమహేశ్వరస్వామి, వనం ఎల్లమ్మ తల్లి, వనం మైసమ్మతల్లి బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి జలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం డప్పువాయిద్యాలతో మహిళలు బోనాలతో వెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో శ్రీకంఠమహేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ బైరు వెంకటేశ్, గౌడ సంఘం అధ్యక్షుడు పాలకూర్ల కుమార్, మాజీ ఉపసర్పంచ్ బైరు బాలరాజు, లక్ష్మయ్య, రాజయ్య, కొయ్యడ శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, కొయ్యడ శ్రీను, బైరు శ్రీనివాస్, గడ్డం ప్రభాకర్, పాలకూర్ల నవీన్, ఉపేందర్, బైరు భరత్, కొయ్యడ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం ప్రతిభా పురస్కారానికి ఎంపిక


కొంగరి రాకేష్

రాజాపేట: పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన రాజాపేట మండలంలోని రఘునాథపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కొంగరి రాకేష్ వందేమాతరం ప్రతిభా పురస్కారం -2024కి ఎంపికయ్యాడు. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి 10జీపీఏ సాధించిన విద్యార్థులను ఈ పురస్కారాలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డితో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కొంగరి రాకేష్‌కు లభించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు రాకేష్‌ను అభినందించారు.